క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: ఫీడర్ లైన్ల నిర్వహణ నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని బాచుపల్లి సబ్‌స్టేషన్ ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ బీవీఆర్ఐటీ బైఫరికేషన్ పనుల నేపథ్యంలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రాజీవ్‌గాంధీనగర్, వడ్డెర బస్తీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉత్సవాలను బహిష్కరించడం సిగ్గుచేటు

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పిడమర్తి రవి బహిష్కరించడం సిగ్గుచేటు అని తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ డాక్టర్ బండారు వీరబాబు బుధవారం పేర్కొన్నారు. పదవిలో ఉన్నంత కాలం మౌనంగా ఉంటూ కోట్ల రూపాయాలను సంపాదించుకున్న ఆయన నేడు పదవులు లేకపోవడంతో సీఎం కేసీఆర్ పై విమర్శలు చేయడం దారుణమన్నారు. తిన్నింటి వాసాలు లెక్కపెట్టే పిడమర్తి రవిని ప్రజలు సహించరన్నారు. నిజమైన ఉద్యమకారుడైతే పదవుల కోసం కాకుండా ప్రజల అభివృద్ధికి పని చేయాలన్నారు. సంపాదనకు మరిగి పదవుల కోసం వెంపర్లాడు పిడమర్తి రవికి త్వరలో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని వీరబాబు హెచ్చరించారు.

పెరుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం

రసూల్‌పురా: నగరవాసులు ఎలక్ట్రిక్ వాహనాలను అధికంగా వినియోగిస్తున్నారని మంత్రి మల్లారెడ్డి పేర్కొన్నారు. కంటోన్మెంట్ న్యూ బోయిన్‌పల్లిలో గ్రీన్‌హబ్ ఆటోమోటివ్స్ మోంట్రా ఎలక్ట్రిక్ సూపర్ ఆటో షోరూంను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పర్యావరణ సంస్థ సీఈవో సుశాంత్ జెనా మాట్లాడుతూ.. గ్రీన్‌హబ్ ఆటోమోటివ్స్ సంస్థ మోంట్రా ఎలక్ట్రిక్ సూపర్ ఆటోను తెలంగాణలో ప్రవేశ పెడుతున్నామని వినియోగదారులు తమ పెట్టుబడిపై అధిక రాబడిని ఈ సూపర్ ఆటో ద్వారా పొందవచ్చన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అమ్మకాలు, విడిభాగాలు సర్వీస్ సేవలను అందజేస్తామని ఆటోమోటివ్స్ నగర డీలర్ శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మర్రి రాజశేఖర్‌రెడ్డి, తేజ పవన్ కుమార్, కిరణ్‌కుమార్ విద్యాధర్, పాత లక్ష్మణ్ పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో స్విగ్గీ డెలివరీ బాయ్ మృతి

సనత్‌నగర్: హాస్టల్ గదిలో స్విగ్గీ డెలివరీ బాయ్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు వివరాల ప్రకారం.. తమిళనాడుకు చెందిన గోపాలన్ శ్రీనివాస్ (50) స్విగ్గీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ భవానీ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ నెల 28న విధులు ముగించుకుని హాస్టల్‌కు వచ్చిన గోపాలన్ శ్రీనివాస్ భోజనం చేసి గదిలోకి వెళ్లి బయటకు రాలేదు. మంగళవారం మధ్యాహ్నం నుంచి హాస్టల్‌లో దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు హాస్టల్ యజమానికి ఫిర్యాదు చేశారు. హాస్టల్ గదులన్నీ తనిఖీ చేయగా గోపాలన్ శ్రీనివాస్ గది నుంచి ఎక్కువగా దుర్వాసన రావడంతో లోపలికెళ్లి చూడగా బెడ్‌పై శవమై ఉండడం పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే.. గోపాలన్ శ్రీనివాస్ గత కొంతకాలంగా హైబీపీ సమస్యతో బాధపడుతుండడంతో పాటు మెదడులో రక్తం గడ్డకట్టడంతో అందుకు సంబంధించిన చికిత్స పొందుతున్నట్లు గదిలో లభ్యమైన మెడికల్ రిపోర్టుల ద్వారా తెలిసిందని పోలీసులు పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 10మందికి జైలు

సనత్‌నగర్: బేగంపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 47 మందిపై కేసులు నమోదవ్వగా 37 మందికి జరిమానా విధించారు. అలాగే మొదటిసారి పట్టుబడ్డ ఏడుగురితో పాటు రెండోసారి పట్టుబడ్డ మరో ముగ్గురికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు.

జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడిగా రంగ శ్రీనివాస్‌గౌడ్

చింతల్: మేడ్చల్ జిల్లా బీజేపీ ఓబీసీ ఉపాధ్యక్షుడిగా రంగ శ్రీనివాస్‌గౌడ్ నియమితులయ్యారు. బుధవారం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, జిల్లా అధ్యక్షుడు మంగేష్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. అధిష్టానం తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న రంగ శ్రీనివాస్‌గౌడ్

బస్సు డిపో, ప్రభుత్వ కళాశాల ఏర్పాటు

హామీలు ఏమయ్యాయి?

బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్



జగద్గిరిగుట్టలో ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

జగద్గిరిగుట్ట: 'కుత్బుల్లాపూర్ గోస – శ్రీశైలం అన్న భరోసా' కార్యక్రమంలో భాగంగా బుధవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని దేవమ్మ బస్తీ, సంజయ్‌పురి కాలనీ, అంజయ్య నగర్ బస్తీల్లో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ స్థానిక బీజేపీ నేతలతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా యువ నాయకుడు మహేందర్ ఆధ్వర్యంలో 200 మంది యువకులు పాదయాత్రకు బైక్ ర్యాలీగా తరలివచ్చి శ్రీశైలంగౌడ్‌కు ఘన స్వాగతం పలికారు.

– ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడేళ్లుగా తెలంగాణలో పేదలకు కేంద్ర ప్రభుత్వం 5కిలోల రేషన్ బియ్యాన్ని ఉచితంగా ఇస్తోందన్నారు. ఈ పంపిణీని రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా నిలిపివేసిందన్నారు. యువతకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి, ప్రశ్నాపత్రాలను లీకేజీ చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. జగద్గిరిగుట్టలో బస్సు డిపో, ప్రభుత్వ కళాశాల, బస్తీ దవాఖానా హామీలు ఏమయ్యాయని... ఎన్నికల సమయంలోనే అధికార పార్టీ నాయకులకు ఇవి గుర్తుకు వస్తాయా అని ప్రశ్నించారు. ఈసారి ప్రచారానికి వచ్చే ఎమ్మెల్యేను నిలదీయాలన్నారు.

◆ ఈ కార్యక్రమంలో కేకేఎం ట్రస్ట్ చైర్మన్, బీజేపీ నేత కూన శ్రీనివాస్ గౌడ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జేకే శేఖర్‌యాదవ్, డివిజన్ అధ్యక్షుడు పున్నా రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గరిగె శేఖర్ ముదిరాజ్, జిల్లా అధికార ప్రతినిధి మేకల సురేష్‌రెడ్డి, సీనియర్ నాయకులు అర్కల సుధా, సిద్దిరాంరెడ్డి, అరుణారెడ్డి, వసుందర, గండి రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులను పరిరక్షించడంలో విఫలం



లింగంచెరువు శిఖం భూమిలో జరుగుతున్న అక్రమ నిర్మాణం వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: మిషన్ కాకతీయతో చెరువులకు పూర్వ వైభవం తీసుకొచ్చి రక్షిస్తామని గొప్పలు చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం వాటిని పరిరక్షించడంలో ఘోరంగా విఫలమైందని మేడ్చల్ జిల్లా పార్టీ ఇన్‌చార్జ్ డా. ఎస్.మల్లారెడ్డి అన్నారు. సూరారంలోని లింగం చెరువు శిఖం భూమి సర్వేనం. 94లో వెంకటసాయి బిల్డర్స్ పేరిట చేపట్టిన కన్‌స్ట్రక్షన్ వద్ద బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. చెరువు శిఖం భూమితో పాటు అలుగును సైతం అక్రమించారన్నారు. ఇప్పటికే 16.36 ఎకరాల్లో విస్తరించిన లింగం చెరువుకు చెందిన 6 ఎకరాల భూమి ఆక్రమణలకు గురైందన్నారు. ఈ విషయంలో ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా లింగం చెరువు శిఖం భూమిలో అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలకు అనుమతులా?

నిజాంపేట్: ప్రభుత్వానికి చెందిన భూముల్లో అక్రమ నిర్మాణాలకు టీఎస్‌బీఎస్ ద్వారా అనుమతులు ఇవ్వడం దారుణమని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. బాచుపల్లి సర్వే నం.165, 126లలో అక్రమ నిర్మాణాలపై బుధవారం రెడ్డి ఎవెన్యూ కాలనీవాసులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. 2018లో కొందరు వ్యక్తులు రెడ్డి ఎవెన్యూ అనుకుని ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేశారు. అప్పుడు బీజేపీ నేతలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా సదరు భూమి సర్వే నం.109కు సంబంధించిందని తెలిపారన్నారు. తాజాగా సర్వే నం.109లోని భూమిని సర్వే నం.165లో ఉన్నట్లుగా చూపుతూ బహుళ అంతస్తు నిర్మాణాలకు అనుమతి ఇచ్చారని పేర్కొన్నారు. కాలనీకి చెందిన రోడ్డును సైతం అందులో చూపించారని తెలిపారు. రెవెన్యూ అధికారులు వెంటనే సర్వే నిర్వహించి రెడ్డి ఎవెన్యూకాలనీకి చెందిన రోడ్డు కబ్జా కాకుండా చూడాలన్నారు. ప్రైవేట్ వ్యక్తులకు సహకరిస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



రెడ్డి ఎవెన్యూ కాలనీవాసులతో కలిసి నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

పొగాకుకు ఎంత దూరం ఉంటే అంత మంచిది

ఎస్ఎల్‌జీ ఆస్పత్రి ఈడీ సోమరాజు



రన్ వాక్‌లో పాల్గొన్న ఔత్సాహికులు

నిజాంపేట్: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం బాచుపల్లిలోని ఎస్ఎల్‌జీ ఆస్పత్రి ఆధ్వర్యంలో 5కే రన్, వాక్ నిర్వహించారు. ఈ రన్‌లో చిన్న పిల్లల నుంచి 80ఏళ్ల వృద్ధుల వరకు సుమారు 800 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎల్‌జీ ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీవీఎస్ సోమరాజు మాట్లాడుతూ.. పొగాకు వాడటం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 5కె రన్ నిర్వహించామని తెలిపారు. ప్రజల నుంచి భారీ ఎత్తున స్పందన రావడం సంతోషంగా ఉందన్నారు. పొగాకు వాడకం వల్ల గుండె సంబంధిత, నాడీ సమస్యలు, మూత్రపిండాల సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు.

◆ ఊపిరితిత్తులకు వ్యాధులు వస్తాయని తెలిపారు. పొగాకుకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదన్నారు. మన దేశంలో సిగరెట్లు, చుట్టల నుంచి గుట్కా, తంబాకు ఇలా వివిధ రూపాల్లో పొగాకును సేవిస్తున్నారని తెలిపారు. స్టైల్ కోసం కొందరు సిగరెట్ల అలవాటు చేసుకుంటున్నారని.. దేశంలో చాలా వరకు కేన్సర్ వ్యాధులు పొగాకుతోనే వస్తున్నాయన్న విషయాన్ని గ్రహించాలని తెలిపారు. ఈ రన్ బాచుపల్లిలోని ఎస్ఎల్‌జీ ఆవరణ నుంచి మొదలై నిజాంపేట్‌లో మెట్రో వాటర్‌వర్క్స్ వరకు, అక్కడి నుంచి ఆస్పత్రి వరకు కొనసాగింది. ఈ రన్‌లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎల్‌జీ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జూలై 24, 25 తేదీల్లో 'ఎస్ఐడబ్ల్యూపీసీ' గ్లోబల్ సదస్సు

సనత్‌నగర్: సౌత్ ఇండియన్ వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్ (ఎస్ఐడబ్ల్యూపీసీ) అంతర్జాతీయ సదస్సుకు నగరం వేదిక కానుంది. తెలంగాణ టూరిజం సహకారంతో తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఈఐ) ఆధ్వర్యంలో టీసీఈఐ ఎస్ఐడబ్ల్యూపీసీ గ్లోబల్–2023 పేరిట జరిగే ఈ సదస్సు జూలై 24, 25 తేదీల్లో హైటెక్స్‌లోని హెచ్ఐసీసీలో జరగనుంది. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం బేగంపేటలోని హోటల్ హరితప్లాజాలో జరిగిన కార్యక్రమంలో సదస్సు వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీసీఈఐ అధ్యక్షుడు బలరామ్‌బాబు మాట్లాడుతూ.. రెండ్రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ సదస్సుకు భారతీయ వివాహ పరిశ్రమలోని వివిధ రంగాలకు చెందిన నిపుణులు హాజరవుతారన్నారు. భారతీయ వివాహ వ్యవస్థలో అంతర్లీనంగా ఉండే విభిన్నమైన అంశాలకు సంబంధించిన లోతైన పరిజ్ఞానాన్ని ప్రపంచానికి అందించడంతో పాటు ఈవెంట్ రంగానికి చెందిన జాతీయ, అంతర్జాతీయ వక్తలు ఈ సదస్సులో పాల్గొని ప్రసంగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టీసీఈఐ ప్రధాన కార్యదర్శి రవి బురా, శ్రవణ్ మాదిరాజులతో పాటు పలువురు వెడ్డింగ్ ప్లానింగ్ నిపుణులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే ఉద్యోగాలను భర్తీ చేస్తాం



పీపీనగర్‌లో కాంగ్రెస్ పార్టీ కరపత్రాలను పంచుతున్న కొలన్ హన్మంతరెడ్డి

సుభాష్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తెలంగాణాలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేస్తామని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా బుధవారం గాజులరామారం డివిజన్ పరిధి పీపీనగర్, ఉషోదయకాలనీ, భవానీనగర్‌లలో ఆయన పాదయాత్ర చేపట్టి స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. రెండు పర్యాయాలు అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో నెరవేర్చలేదన్నారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన పేదలకు ఇవ్వకుండా సొంత కార్యకర్తలకు ఇచ్చేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసే కాంగ్రెస్ పార్టీని వచ్చే ఎన్నికల్లో గెలిపించాలన్నారు. అధికారంలోకి రాగానే ఖాళీగా ఉన్న 2 లక్షల పైచీలుకు ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. నాయకులు జేమ్స్, సంజీవరెడ్డి, రహీమ్, అజయ్, గఫర్‌ఖాన్, రాహుల్, శ్రీనివాస్‌గుప్తా, సందీప్ తదితరులు ఉన్నారు.

నీటి కనెక్షన్లు, అధిక బిల్లుల సమస్యలను పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే వివేకానంద్



బహదూర్‌పల్లి ఇందిరమ్మ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్: ప్రజావసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటిని సమకూరుస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా బుధవారం ఆయన దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బహదూర్‌పల్లిలోని ఇందిరమ్మకాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా పూర్తి చేసిన రోడ్లు తదితర అభివృద్ధి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి విషయమై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా నెలకొన్న తాగునీటి కనెక్షన్లు, అధిక విద్యుత్ బిల్లులు తదితర సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, సీఐ రామకృష్ణ, ఏఈ ప్రవీణ్, కౌన్సిలర్ ఎల్లుగారి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ కొమురయ్య, బీఆర్ఎస్ నాయకులు మైసిగారి వెంకటేష్, సగ్గిడి శ్రీను, పద్మారావు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆలయాభివృద్ధికి నా వంతు సహకారం ఉంటుంది'



ఆలయ భూమిపూజకు హాజరైన బీజేపీ నేత భరతసింహారెడ్డిని సన్మానిస్తున్న అపార్ట్‌మెంట్ వాసులు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పరిధిలోని సిల్వర్ స్ప్రింగ్ (మోడీ) అపార్ట్‌మెంట్ సభ్యుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయ భూమిపూజ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి భరతసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిల్వర్ స్ప్రింగ్ మోడీ అపార్ట్‌మెంట్ ఉమ్మడి అధ్యక్షుడు రాకేష్ నవీన్, సభ్యులు బోస్ బాబు, బుచ్చిబాబు, రాజేంద్ర, శంకర్ రావు, శంకర్‌రెడ్డి, కృష్ణ, ప్రతాప్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

దుబాయ్ సిటీ ఎగ్జిబిషన్‌లో 'ఆవిర్భావ వేడుకలు'

రసూల్‌పురా: సికింద్రాబాద్ జింఖానా మైదానంలో ఏర్పాటు చేసిన దుబాయ్ సిటీ ఎగ్జిబిషన్‌లో రేపు తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రాబిన్‌సన్ బుజ్జి తెలిపారు. బుధవారం ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజల్లో తెలంగాణ స్ఫూర్తిని నింపేందుకు తమ వంతు బాధ్యతగా తెలంగాణ సాంప్రదాయాలను ప్రతిబింబించేలా బతుకమ్మ ఉత్సవాలు, బోనాల జాతర, పోతరాజుల విన్యాసం, తెలంగాణ ధూంధాం కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు.ఈ కార్యక్రమాలకు డా.ఇన్నారెడ్డి, ప్రజా గాయకుడు గద్దర్, బీఆర్ఎస్ నాయకులు మర్రి రాజశేఖర్‌రెడ్డి, పలువురు ఉద్యమకారులు హాజరవుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహ్మద్‌నూర్, సయ్యద్ మాజీద్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

జీడిమెట్ల: అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ పవన్ వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా జమ్మలమడుగుకు చెందిన అశోక్ (28)కు అదే ప్రాంతానికి చెందిన యువతితో వివాహం జరిగింది. అనంతరం భార్యతో కలిసి బతుకుదెరువు కోసం హైదరాబాద్ వచ్చి షాపూర్‌నగర్ న్యూ ఎస్ఎల్‌బీ నగర్‌లో ఉంటున్నాడు. కాగా అశోకు ఓబాబు(4) పాప(2) ఇద్దరు సంతానం ఉన్నారు. అశోక్ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల అశోక్ భార్యకు కడుపులోనే బిడ్డ మృతి చెందింది. దీంతో ఆర్థికంగా డబ్బులు లేకపోవడంతో భార్య పిల్లలను పుట్టింటికి పంపించాడు. రోజూ కూలీ పనులు చేస్తున్నప్పటికి ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. దీంతో మంగళవారం రాత్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న అశోక్ ఉరి వేసుకుని మృతిచెందాడు. రోజూ పనికి వేచ్చే అశోక్ పనికి రాకపోవడంతో అనుమానం వచ్చిన తోటి కూలీలు ఇంటికి వచ్చి చూడగా అశోక్ అప్పటికే మృతిచెంది ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బల్కంపేట-సనత్‌నగర్ మార్గం విస్తరణలో కదలిక

కూల్చివేతలు చేపట్టిన అధికారులు

సనత్‌నగర్: దశాబ్ద కాలానికి పైగా సాగుతున్న ఫతేనగర్ ఫ్లైఓవర్ కింద బల్కంపేట–సనత్‌నగర్ మార్గం ఎట్టకేలకు సుగమం చేసే దిశగా అధికారులు మరో అడుగు ముందుకువేశారు. బ్రిడ్జి కింద సబ్ వే విస్తరణకు అడ్డుగా ఉన్న ప్రైవేటు ఆస్తులకు సంబంధించి నష్టపరిహారం చెల్లించి వాటిని కూల్చివేసే ప్రక్రియలో కదలిక వచ్చింది. సబ్ వే విస్తరించేందుకు పదేళ్లుగా ప్రయత్నిస్తూ వస్తున్నారు. ఫతేనగర్ బ్రిడ్జి నిర్మాణం జరిగాక బ్రిడ్జి కింది నుంచి సనత్‌నగర్–బల్కంపేట మార్గంలో మాత్రమే రాకపోకలు సాగుతూ వస్తున్నాయి. మరోవైపు అంటే బల్కంపేట–సనత్‌నగర్ మార్గంలో ప్రైవేటు ఆస్తులు ఉండడం.. ఆస్తులు కోల్పోతున్న వారికి నష్టపరిహారం చెల్లింపు విషయంలో తలెత్తిన వివాదం జాప్యానికి కారణమైందనే చెప్పాలి. అప్పట్లో మార్కెట్ ధర కన్నా రెండింతలు నష్టపరిహారం ఇస్తామని అధికారులు ప్రకటించినా అది సాధ్యం కాలేదు. ఆ తర్వాత టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) ప్రతిపాదనను తెరమీదకు తీసుకురాగా కొంతమంది మాత్రమే అంగీకరించారు. దీంతో సబ్ విస్తరణ గత కొన్నేళ్లుగా అసంపూర్తిగానే మిగిలిపోయింది. ఈ క్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, స్థానిక కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి ఇక్కడి భవన యజమానులతో సమావేశం ఏర్పాటుచేసి టీడీఆర్ ప్రతిపాదనకు ఒప్పించడంతో బుధవారం కూల్చివేతల ప్రక్రియ ప్రారంభం అయింది.

'బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం పాటుపడుతోంది'



గోపన్‌పల్లిలో జరిగిన విప్రహిత బ్రాహ్మణ సేవా సదన్ ప్రారంభోత్సవానికి తరలి వెళ్తున్న శ్రీగాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు

సుభాష్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణుల సంక్షేమానికి పాటు పడుతోందని శ్రీగాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ అన్నారు. బుధవారం గోపన్‌పల్లిలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా జరిగిన విప్రహిత బ్రాహ్మణ సేవా సదన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సూరారం కాలనీ నుంచి శ్రీగాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దూపదీప నైవేద్య పథకంలో ఆలయానికి రూ.10వేల చొప్పున నిధులు కేటాయించారన్నారు. మరెన్నో ప్రోత్సాహకాలు ఇస్తూ బ్రాహ్మణుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. జర్నలిస్ట్ సర్వేపల్లి రమేష్‌కుమార్, లక్ష్మీకుమారి, రుచిత రాంబాబు, నవనీత, లక్ష్మి సంజీవరావు, కృష్ణవేణి, గీత శ్రీధరాచార్యులు తదితరులు తరలివెళ్లారు.

ప్రజా సంక్షేమానికి పాటు పడుతున్నాం



సమస్యలు వింటున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: ప్రజా సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పాటు పడుతోందని శాసన మండలి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. బుధవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు బస్తీలు, కాలనీలకు చెందిన ప్రజలు శంభీపూర్‌రాజును కలిసి స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కోట్లాది రూపాయల నిధులను పురపాలక మంత్రి కేటీఆర్ సహకారంతో వెచ్చిస్తూ కుత్బుల్లాపూర్‌ను అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తున్నామని ఎమ్మెల్సీ అన్నారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ నీలారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న భౌరంపేట్ పీఏసీఎస్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి

నిజాంపేట్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. బుధవారం కమిషనర్ రామకృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యదవ్‌తో కలిసి ఆమె అధికారులు, కౌన్సిలర్లకు దిశానిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా నీలారెడ్డి మాట్లాడుతూ.. జూన్ 2వ తేదీ నుంచి 20రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా ఒక్కో రోజు ఒక్కో విభాగానికి సంబంధించి అంశాలపై కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి ఆయా కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. అదే విధంగా ఆయా డివిజన్లలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఫ్లోర్ లీడర్ కార్పొరేటర్ ఆగం పాండుముదిరాజ్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, ఇంజినీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, వాటర్ వర్క్స్, రెవెన్యూ, పోలీస్, హార్టికల్చర్, ఎలక్ట్రికల్ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని సమన్వయంతో నిర్వహించాలి

దుండిగల్: రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు కౌన్సిల్ సభ్యులు సమన్వయంతో పని చేయాలని భౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ బాల్‌రెడ్డి అన్నారు. ఈనెల 3న రైతు దినోత్సవాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో బుధవారం భౌరంపేట్ పీఏసీఎస్ కార్యాలయంలో డైరెక్టర్లు, రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి మాట్లాడారు. రైతులకు అందిస్తున్న రుణాలు, పీఏసీఎస్ సాధించిన అభివృద్ధిపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న రైతు రుణాలు, రైతు బంధు తదితర విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో దూలపల్లి సొసైటీ చైర్మన్ నరేందర్, దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, భౌరంపేట్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, డైరెక్టర్లు పాల్గొన్నారు.